క్లుప్తంగా

విశ్వకర్మ మండలపూజ



పూజలో పాల్గొన్న భక్తులు

నిర్మల్: జిల్లాకేంద్రంలోని సోఫీనగర్‌లో ఇటీవల నిర్మించిన విశ్వకర్మ ఆలయంలో ఆదివారం మండల పూజ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కంచర్ల శివశంకరాచారి బృందం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణలతో పంచామృతాభిషేకాలు, యజ్ఞం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలకేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి పెద్దమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న రమణారావు

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులు లహరీ, అస్మిత, వైష్ణవి, భరత్వాజ్, రోహిత్, సూరజ్‌ను కుంటాలలో మాజీ ఎంపీపీ అరుణారమణారావు సన్మానించారు. కార్యక్రమంలో పోషకులు దశరథ్, శివలింగం, శ్రీనివాస్, జగన్, శివ, గ్రామపెద్దలు గందె శివకుమార్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం కార్యవర్గం



అధ్యక్షుడ్ని సన్మానిస్తున్న కార్యవర్గం

ఖానాపూర్: యూఎస్ఆర్ జ్యోషి స్మారక గాయత్రి ఖానాపూర్ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ అనిల్‌బాబు అధ్యక్షతన ఆ సంఘం పట్టణ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం పట్టణ నూతన అధ్యక్షుడిగా నిమ్మగడ్డ రవీందర్‌శర్మ, ఉపాధ్యక్షుడిగా పెరుమాండ్ల సంతోష్‌చారి, ప్రధాన కార్యదర్శిగా విష్ణుంబొట్ల కీర్తిరాఘవ శర్మ, సహాయ కార్యదర్శిగా కె.ప్రవీణ్‌శర్మ, ముఖ్య సలహాదారులుగా సతీష్‌రావుదేశ్‌పాండే, కిషన్‌రావు, నిమ్మగడ్డ నాగరాజు శర్మ, ఆనంద్‌శర్మ, సంతోష్‌శర్మ ఎన్నికయ్యారు.

'ఆరోపణలు అర్థరహితం'

ఖానాపూర్: మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా ఓడిపోయిన మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్.. మున్సిపల్ చైర్మన్‌తో జరిగిన లోపాయికారి ఒప్పందంతోనే కౌన్సిలర్లపై అర్థరహితమైన విమర్శలు చేస్తున్నారని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పరిమి సురేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణ అభివృద్ధిపై మాట్లాడని మాజీ సర్పంచ్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశ పెడితే ఎందుకు మాట్లాడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నాయిని సంతోష్, కావలి సంతోష్, జన్నారపు శంకర్, తొంటి శ్రీనివాస్, అమానుల్లాఖాన్, షబ్బీర్ పాషా తదితరులు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాల్లో పిచికారీ చేయిస్తున్న కమిషనర్

నిర్మల్‌టౌన్: రోగాల బారిన పడకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు సూచించారు. జిల్లా కేంద్రంలోని సాగర్ కాలనీలో ఆదివారం దోమల నివారణకు పైరిత్రిన్, టీమ్ పాస్ ద్రావణాలతో పిచికారి చేయించారు. సాగర్ కాలనీ రోడ్డు నెంబర్–12 లో డెంగీ కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవి దాస్, జవాన్ సంతోశ్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, భోజారెడ్డి, మహేందర్ తదితరులున్నారు.

పాతికేళ్లకు కలిసిన స్నేహితులు

- ఎక్కడెక్కడి నుంచో వచ్చి..
- గురువులను సన్మానించి..
- ఆత్మీయ పలకరింపులతో సంతోషంగా గడిపిన పూర్వవిద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న మిత్రులు

నిర్మల్: ఐదేళ్లో.. పదేళ్లో కాదు.. ఏకంగా పాతికేళ్లకు కలుసుకున్నారు. ఎప్పుడో బడిరోజుల్లో విడిపోయిన వాళ్లంతా మళ్లీ ఇన్నాళ్లకు ఒక్కటయ్యారు. జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్ సరస్వతీ జ్ఞానమందిర్‌లో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. పట్టణంలోని స్థానిక మారుతీఇన్‌లో నిర్వహించిన ఈ వేడుకకు ఎక్కడెక్కడో స్థిరపడ్డ చిన్ననాటి స్నేహితులంతా తరలివచ్చారు.

యోగక్షేమాలు తెలుసుకొని..

బాల్య మిత్రులంతా ఒక్క చోట చేరడంతో అందరూ చిన్నపిల్లలుగా మారి సందడి చేశారు. బడిలో చేసిన అల్లరి, ఇతర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకొని.. అపురూప క్షణాలను సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

'అరేయ్.. నరేశ్, నరహరి, సంతోష్ ఎంతమారిపోయారురా..! ఏంరా.. నవీన్ నువ్వు కౌన్సిలర్ అయ్యావట కదరా..' అని కపిల్ అంటుంటే.. 'అవున్రా.. నువ్వు కూడా మస్తుమారినవ్‌రా.. మేము ఊరు దాటలేదు. కానీ నువ్వు అపోలో హాస్పిటల్‌లో కార్డియాలజిస్ట్ అయ్యావంటే.. చాలా గర్వంగా ఉందిరా..' అంటూ ఆత్మీయంగా వారు ఆలింగనం చేసుకున్నారు. మిగతా మిత్రులూ వారితో కలిశారు. 'ఎన్నాళ్లకెన్నాళ్లకు కలుసుకున్నాం రా.. !అనుకుంటూ వారంతా ఆత్మీయత చాటుకున్నారు. అప్పుడు కలిసి చదివిన విద్యార్థినులూ దూరప్రాంతాల నుంచి కార్యక్రమానికి హాజరయ్యారు. ఆర్మీలో చేస్తున్న ఎల్.నవీన్ బార్డర్ నుంచి రాగా, పంచాయతీ సెక్రెటరీగా చేస్తున్న ఎస్.నవీన్ ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతం నుంచి వచ్చారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార కారణాలతో హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా వేడుకకు హాజరయ్యారు.

మిత్రులకు నివాళి..

మరణించిన మిత్రులతోపాటు తమకు విద్యాబుద్ధులు చెప్పిన దివంగత ప్రధానాచార్యులు మల్లేశ్ ముధుల్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

కలుస్తామని అనుకోలేదు..



పదోతరగతి వరకు అందరం కలిసి చదివాం. పైచదువుల కారణంగా విడిపోయాం. మళ్లీ ఇరవై ఐదేళ్లకు కలుసుకుంటామని అనుకోలేదు. ఇన్నేళ్లకు కలువడం చాలా ఆనందంగా ఉంది. – డాక్టర్ కపిల్, కార్డియాలజిస్ట్

ఖమ్మం జిల్లా నుంచి వచ్చా



ఉద్యోగరీత్యా ఖమ్మం జిల్లా సత్తుపల్లికి ట్రాన్స్‌ఫర్ అయ్యాను. మన గెట్‌టుగెదర్ ఉందిరా.. అని ఫోన్ రాగానే మిత్రులను కలిసేందుకు 500కి.మీ. దూరం నుంచి వచ్చేశా. –ఎస్.నవీన్, పంచాయతీ సెక్రెటరీ

అప్పటి రోజులు గుర్తొచ్చాయి



మళ్లీ ఓసారి పాఠశాల రోజులు గుర్తుకొచ్చాయి. కలిసి చదివిన స్నేహితులం మళ్లీ ఇన్నాళ్లకు కలువడం చాలా సంతోషంగా ఉంది. అందరం మళ్లీ ఈ వేదికగా ఒక్కటయ్యాం. –శ్రీదేవి, డీఎఫ్ఆర్‌వో

ఎలాగైనా కలువాలని..



చాలా రోజుల నుంచి మా బ్యాచ్ సమ్మేళనం నిర్వహించాలని అనుకుంటున్నాం. సంతోష్, నరహరి, నరేశ్ తదితర మిత్రులం కలిసి ఇన్ని రోజుల కు ఇలా విజయవంతంగా కలిశాం. – బిల్డింగ్ నవీన్, కౌన్సిలర్

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముధోల్‌లోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని బ్రహ్మణ్‌గావ్, బాసర మండలంలోని ఓని గ్రామంలోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మణ్‌గావ్‌లో 30 మందికి, ఓని గ్రామంలోని 36 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. తెలంగాణ పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, రైతుబంధు మండలాధ్యక్షుడు రాంరెడ్డి, తహసీల్దార్లు తుకారం, సంతోష్, కోఆప్షన్ సభ్యుడు ఖలీద్, ఎంపీటీసీ సరళ, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత..

భైంసాటౌన్: భైంసా పట్టణానికి చెందిన ఎర్రవార్ సాయినాథ్‌కు సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో రూ.1.25లక్షల చెక్కును అందించారు. బీఆర్ఎస్ నాయకులు కృష్ణ, రాము తదితరులున్నారు.

'కేసీఆర్ పాలనలో అన్నీ సమస్యలే'



కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాథోడ్ రమేశ్

ఖానాపూర్: కొట్లాడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకుంటే.. సీఎం కేసీఆర్ పాలనలో అడుగడుగునా సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్ గ్రామాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి లోటుబడ్జెగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పలువురు మరణించగా బాధిత కుటుంబాలను పరామర్శించి.. రూ.మూడు వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్వచింతల్ మాజీ ఎంపీటీసీ బండారి పుష్ప–రవీందర్ దంపతులు బీజేపీలో చేరగా వారికి మాజీ ఎంపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టేకు ప్రకాశ్, నాయిని సంతోశ్, ఆకుల శ్రీనివాస్, పెద్ది రమేశ్, ఎనగందుల రవి, తోకల బుచ్చన్న, మల్లయ్య, మహేందర్, రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్, శేఖర్, రుస్తుం, రాజేశ్వర్, రాజు తదితరులున్నారు.

రోడ్డు పరిశీలించిన జెడ్పీటీసీ



కొట్టుకుపోయిన రోడ్డు పరిశీలిస్తున్న జానుబాయి

ఖానాపూర్: కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం రోడ్డు పనులు చేపట్టడంతో ఏటా వర్షాకాలంలో ఆదివాసీ గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ నాయకులు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. మండలంలోని అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లెడికుంట గ్రామంలో కొట్టుకుపోయిన రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాసిరకం పనులతో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షల ప్రజాధనం వృథా చేస్తోందన్నారు. తాత్కాలిక రోడ్డు పనులతో నాసిరకంగా చేపట్టడం, వర్షాలు ప్రారంభం కాగానే కొట్టుకుపోవడం పరిపాటిగా మారిందన్నారు. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. తిరుమలగిరి, పుప్పాల ఉపేందర్, మేకల వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పరిశీలన



సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: డబుల్‌బెడ్ రూం ఇళ్లలో బ్లాక్‌ల వారీగా బోరు వేయించి నీటి సౌకర్యం కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఇంద్రనగర్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీ ముత్యాలవారి వీధిలో శ్రీ రాధాకృష్ణ భక్త బృందం ఆధ్వర్యంలో కట్ట మైసమ్మ బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనమెత్తి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. దీనికి ముఖ్య అతిథిగా చైర్మన్ ఈశ్వర్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అసౌకర్యాల నడుమ'డబుల్' ఇళ్లలోకి..



గదుల్లో నిలిచిన నీరు



ఇళ్ల వద్ద లబ్ధిదారులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీంచౌరస్తాలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి 400 మంది లబ్ధిదారులు వెళ్లాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ ప్రకటించారు. దీంతో లబ్ధిదారులు అసౌకర్యాలు, అవస్థల మధ్యే ఆదివారం తమకు కేటాయించిన ఇళ్లలోకి వెళ్లారు. లబ్ధిదారులను అధికారికంగా పంపించకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కనీస సౌకర్యాలైన విద్యుత్, తాగునీరు లేకపోయినా 90 శాతం మంది ఇళ్లకు వెళ్లి పాత తాళాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చే సుకున్నారు. పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటం, గదుల్లో నీరు ఉండటం వంటి సమస్యలు దర్శనమిచ్చాయి.

అటెన్షన్ ప్లీజ్..

నిర్వహణకు నోచుకోని ఓపెన్‌జిమ్



నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.ఆరు లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చనేశారు. నిర్వహణ సరిగా లేక వ్యాయామ పరికరాలు విరిగిపోయాయి. దీంతో వ్యాయామం చేసేందుకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి జిమ్ పరికరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్‌గౌడ్, ఎంపీఓ, ఫోన్: 94403 11142

శిథిలావస్థకు ప్రభుత్వ కార్యాలయాలు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు, సిబ్బంది
- మరమ్మతులు చేయించాలని మండల ప్రజల వేడుకోలు



కూలిపోయిన విద్యావనరుల కేంద్రం భవనం



శిథిలావస్థకు కుభీర్ పశువైద్యశాల భవనం



కుభీర్ ఎస్సీ హాస్టల్ భవనం

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో అందులో పని చేసే సిబ్బంది, తమ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల విద్యావనరుల కేంద్ర భవనం కూలిపోయి ఐదేళ్లు గడుస్తున్నా.. మరమ్మతులు నిర్వహించలేదు. కుభీర్‌లోని పశువైద్యశాల, ఎస్సీ బాలుర వసతి గృహం, నిగ్వాలో ఉన్న ఎస్సీ హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేక బీసీ హాస్టల్ భవనంలో కొనసాగుతోంది. పల్సి పశువైద్యశాల గోడలు బీటలు వారగా పాంగ్ర పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది.

భవనాలు నిర్మించాలి..

నాసిరకం పనులతో కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అవసరమైన చోట మరమ్మతులు చేయించి.. దెబ్బతిన్న చోట భవనాలు నిర్మించాలని కోరుతున్నా రు.

ప్రభుత్వానికి నివేదించాం..

ఈ విషయమై కుభీర్ ఎంపీడీవో లింబాంది మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన కార్యాలయాల భవనాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి నివేదించామన్నారు. నిధులు మంజూరవగానే నూతన భవనాలు నిర్మిస్తామని తెలిపారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన విజయ్

ముధోల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు భట్టి విక్రమార్కను ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు పీ విజయ్‌కుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. ముధోల్‌లో బహిరంగ సభ నిర్వహించేందుకు తీర్మానం చేసినట్లు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

సభ్యత్వ నమోదు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ సంఘ భవనంలో ఆదివారం మున్నూరుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లాశాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.గంగాధర్, భారె శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు, సలహాదారులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్ హాజరవుతారని మండల ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు రావాలని కోరారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



స్థానికులతో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించి ప్రజారవాణాకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పొట్యా, బండరేవుతండా, పెండల్‌దరి గ్రామాల రోడ్లను ఆయన పరిశీలించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, నర్సయ్య, అబ్దుల్ హాదీ, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

ముధోల్: బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ముధోల్ మండల మాజీ ఎంపీపీ లక్ష్మీనర్సాగౌడ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీనామా పత్రాన్ని పోస్టు ద్వారా అధిష్ఠానానికి పంపినట్లు తెలిపారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి పూర్తిగా సహకరించామని, కాని సీనియర్ నాయకులను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీపీ అనూషాసాయి, బాబా, సర్పంచ్ శ్వేత రవికిరణ్‌గౌడ్, నాయకులు నర్సారెడ్డి లక్ష్మణ్ సత్యానారయణ, గైని భోజన్న, దశరథ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కుంటాల: రాజ్యాధికారం కోసం బీసీలంతా కలిసి పోరాడుదామని పలువురు బీసీ నేతలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీసీలకు రాజ్యాధికారం దిశగా చైతన్యం కోసం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీ బడి శిక్షణ తరగతులు ఈనెల 26న భైంసా కమ్యూనిటీహాల్ గణేశ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు అందరూ తరలిరావాలని కోరారు. ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, బీసీ ఉద్యమ నేత సుంకెట పోశెట్టి, ముధోల్ సర్పంచ్ రాజేందర్, దొనికెన వెంకటేశ్, తాటి శివ, ఎంపీటీసీ సుధాకర్, గౌస్, భాస్కర్, ఒడ్నం రవి తదితరులున్నారు.

'విచారణ చేయాలి'

ఖానాపూర్: డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను సందర్శించారు. నూతన ఇళ్లు పూర్తిస్థాయి సౌకర్యాలు లేకుండా నిర్మించారన్నారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జాబితాలో 40 శాతం అనర్హులకు ఇళ్లను కేటాయించారన్నారు. కొందరు అర్హులు తమకు ఆస్తులు లేవని సెల్ఫ్ అఫిడవిట్ ఇచ్చినా కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. సమావేశంలో షబ్బీర్‌పాషా, షెట్టి శ్యాం మోహన్‌రావు తదితరులు ఉన్నారు.